# జరిగే కథ



రచన; శ్రీ వాలేకార్

[నేను వ్రాసిన ఈ జరిగే కథ, ఎలాంటి కథలకూ, కథానికలకూ అనుసరణా, అనువాదమూ కాదు. ఈ రోజుల్లో జరుగుతున్న నగ్నసత్యాన్ని దృష్టిలో వుంచుకొని వ్రాసినది. ఇందులోని పేర్లు, సంఘటనలూ ఎవ్వరినీ వుద్దేశించి వ్రాసినవి కావు. కథావస్తువును సృష్టించేందుకై నేను కల్పించిన కేవల **కల్పితాలు.**

రచయిత :

వాలేకార్]

అది మే నెల వేసవి కావడంచేత, ఎండలు నిప్పులు చెరిగినట్టుంది. పగలెల్లా తన బలం చూపుతూ, పోట్లాడి అలసినా, తనదే జయం అన్నట్టు సూర్యుడు పీఠ వేసుకొని కూర్చున్నాడు. ఎంతసేపటికి?, ఓడిపోని సూర్యుణ్ణి చూసి ప్రకృతి యుద్ధాన్ని రేపటికి వాయిదా వేసింది. సూర్యుడు తిరుగుముఖం పట్టినా, నీరెండ ఇంకా తగ్గనే లేదు, తూర్పుదిక్కు నుండి సముద్రంపై సరిగమలు పాడుతూ, పిల్లగాలులు అలలుగా చేరి కెరటాలుగా మార్చి, చవులకు టూరెత్తే శబ్దం చేస్తూ, సింహగర్జన చేస్తున్నది. సముద్రంపైనుండి వీచిన చల్లగాలి పూర్లోకసోకి, పగలెల్లా ఎండ వేడికి విలవిలలాడిన మనసుకు ఎంతో హాయ్ అనిపిస్తున్నది. పగలెల్లా వడగాడ్పులకు భయపడి, బయటకు రాని పిల్లలకూ, పెద్దలకూ ఆ చల్లనిగాలి సోకగానే, నాగుకు నాగస్వరం ఊదినంత సంతోషంతో బిలబిలమంటూ ఎవరికి తోచినట్టు వారు షికార్లకని బయలుదేరారు ఈ మద్రాసు మహాపట్టణంలో.

ఆరోజు కాలేజి సెలవులు గావడంచేత పగలెల్లా ఇంట్లో బోర్ కొట్టి, సాయంత్రం అలా క్లాస్‌మేట్ రాధ యింటికని బయలుదేరాను. గుమ్మం దిగగానే ఎవరో పోకిరి వెధవ సైకిల్ పైనుండి యాక్సిడెంట్ చేసినంత పనిచేసి తారాజువ్వలా వెళ్ళిపోయాడు, రాస్కెల్. అంటూ మనసులోనే తిట్టుకొంటూ తలవంచుకొని నడవసాగాను. ఇరుకైన రోడ్ జనంతో మరీ ఇరుకుగా వుంది. కొత్త ఫ్యాషన్ బట్టలంటూ హిప్పీలమని చెప్పుకొని నూనెలెరుగని చింపిరి తలలతో గడ్డాలుమాసిన జిడ్డుముఖాలతో అసహ్యంగా నడుస్తుంటే ఆడవాళ్లుమాత్రం మేమేం తక్కువనా? అన్నట్టు బట్టలే కరువైనట్టు చాలీచాలని బట్టలతో వొంగులు కనిపించే దుస్తులు తొడిగి ఆడ మగా అనే భేదం లేకుండా చేయిచేయి కలిపి వయ్యారంగా నడిచి వెళ్లుతుంటే ఇవేవి పట్టించుకోకుండా పరధ్యాన్యంగా వెడుతున్న నేను అకస్మాత్తుగా నా భుజంపై చేయి పడగానే తృళ్ళిపడి వెనుదిరిగి చూశాను. అపరిచయస్తుడైన అతడి ముఖం చూడగానే గుండె ఆగినంత పనైంది. భయంతో కేకెయ్యబోయి, బెదిరిన లేడిలా ముఖంపెట్టి ఏయ్! ఎవరు నువ్వు? అనగానే కాలరు సరిచేసుకుంటూ సారి మేడమ్! మా చెల్లెలనుకున్నాను, అనేసి కొంటెగా చూస్తూ వాళ్ళ ఫ్రెండ్స్‌తో కలసి ఓరగా చూస్తూ, కన్నుగీటి పళ్ళికిలిస్తూ ముందుకెళ్ళిపోయాడు.

ఎంతధైర్యం నడిరోడ్‌లో ఆడపిల్లపై చెయివేసి చలాకీగా తప్పించుకుని కేర్‌లెస్‌గా వెడుతున్నవాడిని ఓకంట చూసుకుంటూ ముందుకు నడిచాను. అంతలోనే వెనుక నుండి చెవులు చిల్లులు పడేలాగ కారు హారన్, బ్రేకుల కిర్రులతో టైర్లు అరిగేలా శబ్దం చేస్తూ, నా వెనుకనే ఆగింది. అదిరిపడి పక్కకు గెంతాను. కారులోనున్న పెద్దమనిషి ఏమమ్మా ఇంట్లో చెప్పివచ్చావా? లేక ఏవైనా గొడవలు పడి రోడ్‌మీద కొచ్చావా? నడిరోడ్‌లో

"SELEKT"
MOTORS & PUMPS



FOR:—
EFFICIANCY, ECONOMY AND TROUBLEFREE SERVICE.



MOST POPULAR IN TELENGANA DISTRICTS.

: Manufactured by :

CHITRA INDUSTRIES
COIMBATORE-641005

Grams: 'SELECT PUMP' Phone: 24548

: సేల్స్ బ్రాంచ్ :

చిత్రా ఇండస్ట్రీస్
5-1-446, రాణిగంజ్
సికిందరాబాద్-3 (ఎ.పి.)
ఫోన్: 77826

అందున రాంగ్ సైడ్‌లో ఇంతపరాకుగా నడుస్తున్నావ్? అని చిరునవ్వుతో మందలించి, ముందుకెళ్ళిపోయాడు. అంతమంది మగాళ్ళమధ్య తల తీసేసినట్టయింది. అందరి కళ్లు నాచుట్టే వున్నాయి. సగం చచ్చిన ప్రాణంతో, సిగ్గుగా ముందుకు కదిలాను. మరి నడిచేందుకు కాళ్ళురాక సిటీ బస్ కోసం బస్‌స్టాప్‌లో కెళ్ళాను. అక్కడేవున్న రోడ్ రోమియో రౌడీముఖాల్లో ఒకడు నావెంటపడడం నే చూడనేలేదు. నా వెనుకనే నడుస్తూ "నిలువవే వాలు కనులదాన వయ్యారి హంసదాన" అని ఈలపాట పాడుతూ నాచుట్టూ తిరుగుతున్నాడు. మళ్ళీ ఆ బస్‌స్టాప్‌లో నిలిచేందుకు ఇష్టంలేక భయంతో పరిగెత్తినంత పనిచేసి, దూరంగా వెళుతున్న నలుగు రయిదుగురు మనుష్యుల కంటపడగానే వాళ్ళలో చేరి హమ్మయ్య అని వూపిరి పీల్చాను బ్రతుకుజీవుడా అనుకొని.

కొంతదూరం వెళ్ళిన తరువాత ప్రక్కనున్న మరో బస్‌స్టాప్‌కు నడిచాను. అలా నడుస్తున్న నన్ను తాకితాకకుండ వెళ్లేవారూ వెనుకాముందుచూసి దగ్గర్లో ఎవరూ లేకుంటే కన్నుగీటి సైగచేసి వెళ్ళేవారు, ఆడదాన్ని ఒకితేనే చాలని బుజాలెగరేసుకొని తిరిగే మగరాయుళ్ళు కొంతమంది లేకపోలేదు.

ధైర్యంచేసి, కళ్లెర్రచేసేలోగా అరమైలు దూరంవరకు మనిషి పత్తావుండేవాడుకాదు. ఎలాగో బస్‌స్టాప్ చేరడం అప్పుడే బస్ రెడీగా రావడం, నే బస్సులోకెక్కగానే మగపుర్రాళ్లు నా వెనుకనే ఎక్కడం క్షణంలో జరిగిపోయాయి. వెనుక ముందు మగాళ్ళతో కిటకిటలాడే ఆ బస్సులో కాలుపెట్టడమే గగనమయింది. నిండుచూలాల్లా వెళుతున్న ఆ బస్సులో ఈమగాళ్ళు మరీను.

బస్సు గతుకులనే ఆసరా తీసుకొని అదే సమయమని ఆడవాళ్ళమీదపడి వేళ్ళతో మృదువుగా గిల్లేవారు. తలుచుకుంటేనే ఈమగాళ్ళపై అసహ్యమేసేది, ఆబస్సులో ఇక వుండలేక వెంటనే మరోస్టాప్‌లో దిగేశాను.

అలా దిగి రెండడుగులు వేసేలోగ ఎవడో తాగుబోతులావున్న ఒకడు పట్టుతప్పి క్రింద పడబోయినవాడిలా నటించి, అమాంతంగా నన్ను వాటేసి, కౌగలించుకొని మెల్లగా గిల్లి, 'సారి మెడమ్' అన్నాడు ఆదోలా నవ్వి పళ్ళికిలిస్తూ, మళ్లీ రెండవసారి ఏమి ఎరగనివాడిలా ముందునుండి భుజానికి డాష్ చేశాడు. ఆ దెబ్బకు తట్టుకోలేక క్రిందపడబోయాను. నడిరోడ్‌లో ప్రాణంపోయినంత పనయింది. కోపంతో ఎక్కడలేని ధైర్యం. బలం తెచ్చుకొని వెళ్ళేవాడిని అలాగే కాలర్ పట్టుకొని 'ఏయ్ మిస్టర్! బుద్ధిందా? సిగ్గులేదూ? ఒంటరిగావున్న ఆడపిల్ల వెంటపడడానికి? నీకు నాలాంటి అక్క, చెల్లెళ్ళులేరూ?

అన్నాను కోపంగా. అతడు వెకిలిగా సమాధానమిస్తూ ఏం మెడమ్! ఒంటరిగా వున్న వారి వెంట పడకపోతే జంటగావున్న వారి వెంట పడమంటావా? అయినా ఈరోడ్ అంతా నీసొంతంలా మాట్లాడుతున్నావే. నాఇష్టమొచ్చినట్టు తిరుగుతాను అడిగేందుకు నీవెవరు? అంటూ నన్నే దబాయించాడు. 'రాస్కెల్' అంటూ నే చేయిపైకెత్తేలోగ నాచేతిదెబ్బ తగిలేలోగ, అతని చెంప ఛెళ్ మంది ఎవరా అని వెనక్కు తిరిగి చూశాను. అతడుమాత్రం వాడి కాలరి పట్టుకొని వెధవ, ఒంటరిగా వున్న ఆడపిల గదా అని నడిరోడ్ లో దబాయిస్తున్నావా? ఇడియట్, అని మరో లెంపకాయతగిలేలోగ, ప్రక్క సందులోంచి ఒకే పరుగుతీశాడు. వాడు అలా పారిపోగనే ఈతడేమో సినిమాలోని విలన్ ను తరిమి హీరోయిన్ దగ్గర పోజు కొట్టే హీరోలాగ స్టయిల్ గా చూడు మెడమ్! ఇలా వంటరిగా ఆడపిల్లలు బయటికి రావడం ఎంత కష్టమో, తాంక్స చెప్పి ముందు కెళ్ళబోయాను. చూడండి మీ కభ్యంతరం లేకపోతే, మీ యింటివరకు మీకుతోడుగా వస్తాను అన్నాడు అక్కినేని స్టయిల్ గా మరో పోజు పెట్టి. ఫరవాలేదండి ఆ చివరి ఇల్లె మాది అని చెప్పేసి, త్వరత్వరగ నడవసాగాను. అతడుమాత్రం ఇంకా నా వెంటరావడం నే చూస్తూనే వున్నాను. ఏమిటి యీ మనిషి? అంతమందిలో తనేదో ఆడపిల్లలను గౌరవిస్తున్నట్టు బుద్ధిమంతుడిలా నటించి వెనుకమాత్రం ఇలాంటి వెధవ వేషాలు వేస్తాడు. ఛీ! ఛీ! ఏం మనుష్యులో వీరు అనుకుంటూ, భయంగా ఎలాగో రాధ యిల్లు చేరుకున్నాను......గబగబా ఇంటికెళ్ళి, రాధా! రాధా! అని పిలిచాను. అప్పుడే కోవెల కెళుతున్న రాధ అమ్మ చిరునవ్వు నవ్వుతూ, రా శాంతి రాధ యిప్పుడే బయటికెళ్ళింది, వచ్చేస్తుంది నేనలా కోవెలకు వెళ్ళివస్తా, కుమార్ మేడపై చదువుకుంటున్నాడు, రాధ వచ్చేటైం అయింది, కూర్చో అని చెప్పి ఆమె బయటికెళ్ళింది. వెళుతున్న ఆమెనే చూస్తూ అలాగే అని—

సోఫాలో కూర్చున్నాను. నిండైన విగ్రహం, అందమైన తెల్లగావున్న ముత్యాల్లాంటి పలువరుస. నిర్మలమైన మనసులో వెన్న దాగివున్నదాఅన్నట్టు. మనిషికి తగినట్టు పేరు అన్నపూర్ణ. ఏరి కోరి పెట్టారా అనిపించింది. ఆమె అలా కన్నుమరుగు కాగానే వెనుక చప్పుడైతే తిరిగి చూశాను. మేడపైనుండి అప్పుడే దిగుతున్న కుమార్, నన్నుచూసి, హల్లో శాంత! ఎంతసేపయిందివచ్చి అంటూ దగ్గరకొచ్చి, నేకూర్చున్న సోఫాలో నాప్రక్కనే కూర్చున్నాడు.

ఇంతకూ పరీక్షలు బాగా వ్రాశావా? తరువాత మళ్ళీ చదువుతావా? లేక పెండ్లి చేసుకుంటావా? అంటూ ప్రశ్నలవర్షం కురిపిస్తున్నాడు. ఆ మాటలతో బాటు చూపులవర్షం లేకపోలేదు. కుమార్ ఎప్పుడూ అధికంగా మాట్లాడడు. ఈ రోజెందుకో, ఏకవచనంతో పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు. మనసు స్థిమితం లేని నేను మౌనంగా ఉండిపోయాను. నా మౌనాన్ని అలుసుగా తీసుకొని చనువుగా నాదగ్గరగా జరిగాడు. నామనసుకు యిబ్బంది కలిగింది. ముడుచుకొని కూర్చున్న నాకు ముళ్ళపై కూర్చున్నట్టయింది. అలాగే సోఫాను అతుక్కుపోయాను. వున్నట్టుండి వెనుకనుండి మెడమీద వెచ్చని చేయి తగలగానే కొరడాదెబ్బ తిన్నదానిలా అదిరిపడ్డాను. అతడివేళ్ళు నావంటిమీద తాకగానే జెర్రులు, తేళ్ళు పాకినట్టయింది. ఇంకా అక్కడేవుంటే ఏం జరుగుతుందో అని.

తలచుకుంటే ఒళ్ళు జలదరించింది. ఒక్క గెంతున గెంతి, వీధివైపు పరుగెత్తాను. నాకన్నా ముందే గెంతిన కుమార్ మీదు రాబోయాడు. నీళ్ళు నిండిన కళ్ళతో ప్రాధేయపడ్డాను. కుమార్ ఇది నీకు న్యాయంకాదు. నీ చెల్లెలాంటిదాన్ని ఇంటికివస్తే మానభంగం చేసి ఇంత

మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు!




♦ తక్కువ ధర
♦ చిరకాలం మన్నిక
♦ చక్కని అల్లిక
♦

ఇవే ఎవరెడీ బనియన్ల విశిష్టత.

ఎవరెడీ నిట్టింగ్ & వీవింగ్ ఫ్యాక్టరీ.
బి. ఎస్. సుందరం రోడ్డు,
తిరుపూరు—1.

నీచానికి దిగజారుతావా? వద్దు కుమార్ ఇన్ని రోజులు నిన్నొక అన్నగా భావించి, చనువుగా వున్నాను గాని అన్నలు లేని నేను నీలోనే అన్నను చూసి ఆరాధించాను గౌరవించాను. నీ చెల్లిమీదే చేయి వేస్తావా? నీ వింత కఠోరంగా ప్రవర్తించి నా జీవితం నాశనం చేయకు. నీ కాళ్లు పట్టుకుంటాను, అని ఎంత ఏడ్చినా, కామంతో నిండిన కళ్లతో వెకిలిగా నవ్వుతూ నా మాట లేవీ చెవి కెక్కని కుమార్ తాగినవాడిలా తూలుతూ, నా చెయ్యి పట్టి లాగాడు. ఇప్పుడేంచేసేది వంటింట్లో చిక్కిన కుందేలులావుంది నాపరిస్థితి.

ఎలాగో చచ్చిన పాము బుసకొట్టినట్టు కుమార్ ఆగు. లేకుంటే ఈకత్తి నీగుండెలో దిగుతుంది జాగ్రత్తఅంటూ మూలనున్న పళ్ళు కోసే కత్తి తీసుకున్నాను. ఇదేది లెక్కచేయని కుమార్, శాంతా నీ బెదరింపులకు బెదిరే వాణ్ణికాను. ఎలాగైనా నిన్ను యిప్పుడు లొంగదీయందే నిద్రపోడీకుమార్.

మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు!!

నాణ్యమునకు - నమ్మికకు -

ఎవరెస్ట్ బనియన్లనే

ఉపయోగించండి.




ఛీ! నోరుముయ్. చెల్లెకి తల్లికి తేడా తెలియని నీవూ ఒక మనిషివేనా? శాంతి ఎంత తప్పించుకుందామన్నా వృధాశ్రమ, ఛీ! వరుసలుగూడా తెలియని నీలాంటి కామాంధుడికంటె పశువులు నయం. అవైనా సాటి పశువులను పోల్చుకుంటాయి. శాంతి నీ వుపన్యాసాలు కట్టిపెట్టి ముందు కర్తవ్యం ఆలోచించు అంటూ అమాంతంగా మీదకొచ్చాడు. సింహం నోట్లో తలదూర్చినట్టు గిలగిల తన్నుకున్నాను. ఈ సమయంలో రాధ అయినా వస్తే బాగుండుననిపించింది.

నన్ను దేవుడే కనికరించినట్టు రాధ, అన్నపూర్ణమ్మ అప్పుడే లోపలకు అడుగేశారు. లోపలి ఈదృశ్యం చూడగానే కు...మా...ర్ అన్న అన్నపూర్ణమ్మ కేకకు, ఇల్లె దద్దరిల్లినట్టయింది. గుమ్మంలోనిలబడ్డ ఆమెను చూడగానే గతుక్కుమన్నాడు. కోపంగావున్న ఎర్రని ఆమె కళ్ళలోనుండి నిప్పులే రాలుతాయా అన్నట్టు కళ్ళలో సూర్యమండలాన్నె యిముడ్చుకున్నట్టు. ఆ చూపులకే శక్తి వుంటె ఎదురుగావున్న కుమార్ మాడి మసైపోయి వుండేవాడు. ఇదేది పట్టించుకునే ఓపిక లేని నేను ఒక్క పరుగున బయటికి పరుగెత్తాను. ఎలా ఇల్లు చేరుకున్నానో నాకే తెలియదు.

ఆరోజు రాత్రి అన్నంకూడా సహించక, బాధగా వున్న మనసుతో నీరసంగా అలాగే మంచంపై పడుకుండిపోయాను. ఎంత ప్రయత్నించినా నిదురరాక, మరచిపో ప్రయత్నించినా ఆనాటి పగటి ఆలోచనలే తలలో సుడిగుండాలులాగ సుళ్లు తిరుగుతున్నాయి. అన్నీ సమాధానాలు... లేని... సందేహాలే.

ఏమిటి ఈలోకం?

ఎందుకు ఆడదంటే మగవాళ్ళకు ఇంత చులకన??

ఏమిటి మగవాని వైఖరి???

ఆడదంటె చులకనా?

లేక మగవాళ్ళ కంటికి కనిపించే ఆటబొమ్మనా?

ఇదేనా మారుతున్న కాలం???

మారుతున్న కాలంలో మారుతున్న మనుష్యు లెవరు?

ఎవరు??

ఎవరు???

? ? ?

ఇన్ని ప్రశ్నలకు జవాబు దొరకక తలవేడితో ఎప్పుడు ఆ నిద్రాదేవి ఒడిలో నిద్రపోయానో నాకే తెలియదు.